# దళిత సంక్షేమ పథకాలన్నిటినీ అమలు చేయాలి

## డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్

వివరాలు మెయిన్‌లో

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శనివారం 21, డిసెంబరు - 2024 | 8 పేజీలు


# ఆక్రమణలపై 'ఉక్కుపాదం'

ఆర్ అండ్ బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు

అక్రమ నిర్మాణాలు నేలమట్టం.

దూకుడు పెంచిన రెవెన్యూ,పోలీసు అధికారులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

**విశాలాంధ్ర-గాలివీడు:** ఆర్ అండ్ బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, నిర్మాణాలను నేలమట్టం చేసి అధికారులు దూకుడు పెంచారు. అక్రమార్కుల గుండెల్లో రైళు పరిగెత్తించిన అధికారులు ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే గాలివీడు పట్టణంలోని గేటు నాలుగురోడ్ల కూడలిలో సర్వే నంబర్ 2266 లో ఉన్న 1.80 యకరాలు భూమిలో ఆక్రమణ నిర్మాణాలు,దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.ఇదే తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్,ఆర్డీఓ ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం,ఆర్ అండ్ బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణ దారులకు తాఖీదులు అందజేశారు.15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని ఆక్రమ నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తాసీల్దార్

2

# ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలి :జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## 26 నుండి కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటన

**విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను..జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి.. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా.. ఆయా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో నీతి ఆయోగ్ సీఈవో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు డిఆర్వో విసవేశ్వర నాయుడు, జెడ్పి సీఈవో ఓబులమ్మ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. "నీతీ ఆయోగ్" ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లాల్లో భాగంగా.. వైఎస్ఆర్ జిల్లాలో సామాజిక స్థాయిని.. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. సంబందిత శాఖలు అన్ని పారమీటర్లలో 100% లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆకాంక్ష బ్లాకుల లక్ష్యసాధనలో భాగంగా సికే దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల ఆశయ సాధన లక్ష్యాలను సంతృప్త స్థాయిలో.. సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కృషి చేయాలన్నారు.

26 నుండి కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటన.. లియాస్పిరేషన్ లోభాగంగా జిల్లాలో జరుగుతున్న ప్రగతిపై సమీక్షించేందుకు కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటించనున్నారని.. ఆయన పర్యటనను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26 నుండి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు.. సికే దిన్నె, పెండ్లిమర్రి, జమ్మలమడుగు మండలాల్లో క్షేత్రస్థాయిలో జరిగిన, జరుగుతున్న ప్రగతిని ఆయన పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల అధికారులు తదితర అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

# రావణకాష్టం !

- ○రాత్రి వేళ దట్టమైన పొగలు
- ○ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ○పరిశ్రమ మూసివేతకు డిమాండ్
- ○న్యాయస్థానాన్ని ఆశ్రయించే యోచన

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పెద్ద దుద్యాల గ్రామ సమీపంలో కొనసాగుతున్న జీఎం ఏకో కెమికల్ పరిశ్రమ ద్వారా సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యాల బారిన పడుతున్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ పరిశ్రమ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్న కారణంగా సమీపంలోని పెద్ద దుద్యాలతో పాటు వేల్పుచర్ల, రాజగురువాయపల్లె మరో 10కి.మీ. మేర భరించలేని దుర్గంధం వ్యాపిస్తూ ప్రజల ఆరోగ్యాలపై విషప్రభావం చూపుతున్న అంశాన్ని ఇదివరకే ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. 2019లో కేవలం ఐదు ఎకరాలలో స్థాపించిన పరిశ్రమ తమ అవసరాల నిమిత్తం పక్కనే ఉన్న ప్రభుత్వ చెరువు భూమిని సైతం వాడుకుంటున్నప్పటికీ స్పందించే అధికారులు కరువయ్యారు. సదరు కంపెనీ నిర్వాహకులు లాభాపేక్షతో ప్రజలు, పశుపక్షాదుల ప్రాణాలతో చెలగాట మాడడంపై ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామాల ప్రజలు ఆందోళనలకు దిగినా వాతావరణ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదుచేసినా సదరు అధికారులు స్పందించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దున్నపోతుపై వర్షం పడిన చందంలా అధికారుల పనితీరు ఉందని ఈ ప్రాంత ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

**రావణకాష్టంలా...! :**తాజాగా ఈ పరిశ్రమ పరిసరాల నుండి రాత్రి సమయాల్లో దట్టమైన పొగలతో

2

# ఎవరిష్టం వారిది.?!

## తీరు మారని రిమ్స్ పరిపాలనా విభాగంలో కొందరి తీరింతే.?

**విశాలాంధ్ర - కడప :** కడప సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్ )లో ఎవరిష్టం వారిది అన్నట్లు వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగుల తీరు మారడం లేదు. ప్రతిష్టాత్మకమైన వైద్య సేవలు అందించే రిమ్స్‌లో ప్రధానమైన పరిపాలన విభాగంలో ఇలాంటి వ్యవహారాలు విమర్శలకు తావునిస్తున్నాయి. విభాగాల కేటాయింపు, బాధ్యతలు అప్పగింత లాంటి వాటిలో మతలబులు నెలకొనడంతో అక్కడి ఉద్యోగులే ఆరోపణలు చేసే పరిస్థితి ఏర్పడింది. తాజాగా పరిపాలన విభాగంలోని జి టు భాగం సీనియర్ అసిస్టెంట్ లుక్ ఆఫ్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగికి ఇచ్చి వెళ్లడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.పరిపాలన విభాగంలో ఏడు మంది రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. అయితే వీరిలో ఎవరికి కాకుండా ఔట్సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కు లుక్ ఆఫ్టర్ ఇచ్చి వెళ్లడం ఏంటని మాట్లాడుతున్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ కు సంబంధం లేకుండా ఇలాంటి ఆదేశాలు జారీ కావడం జరుగుతుందని చెప్పుకొస్తున్నారు. అంతేకాదు పరిపాలన విభాగంలో శాఖలు కేటాయించాలని కొన్ని నెలల క్రితమే సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు అవి అమలు కాలేదు. పరిపాలనా విభాగంలో ఏ బాధ్యతలు ఎవరికి ఇవ్వాలో, ఒకరు సెలవులో వెళ్లేటప్పుడు ఆ భాధ్యతలు ఎవరికి అప్పగించాలో అన్న నిబంధనలు ఉన్నాయో లేవో కానీ ఇక్కడ మాత్రం ఎవరిష్టం వారిది కావడంపై విమర్శలు తప్పడం లేదు.

## రావణకాష్టం !

(మొదటి పేజీ తరు వాయి)

పాటు అగ్నికీలలు ఎగిసి పడుతుండడంతో సమీప గుట్ట ప్రాంత గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు. ముద్దనూరు నుండి పులివెందుల వైపు వెళ్లే వాహనదారులు సైతం ఇక్కడ ఏం జరుగుతోం దోనన్న ఆందోళనకు గుర వుతున్నారు. పరిశ్రమలోని వ్యర్థాలను పోగుచేసి నిప్పు పెడుతున్నట్లు తెలుస్తోంది. దుర్వాసనతో కూడిన పొగ పీల్చుకొనే గాలిలో కలుస్తున్న నేపథ్యంలో సర్వత్రా ఆగ్రహా వేశాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి 11 గంటల సమయం నుండి తెల్లవారుజాము వరకు అక్కడ రావణకాష్టం మండుతూ ఉంటుందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ మూసివేతకై న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని స్థానికులు యోచి స్తున్నట్లు సమాచారం. పలువురు అభ్యు దయవాదులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వానికి మరోమారు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

## ఆక్రమణలపై 'ఉక్కుపాదం'

(మొదటి పేజీ తరు వాయి)

భాగ్యలత,ఎస్సై రామకృష్ణ సమ న్వయంతో చాకచక్యంగా వ్యవ హరిస్తూ ఆక్రమణలను తొల గించారు. చివరగా మహాత్మ గాంధీ విగ్రహం చుట్టూ చికెన్ సెంటర్ల తొలగింపు, అక్రమ నిర్మాణాల తొలగింపుకు సంఘీభావంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న గాంధీ మహాత్ముడి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అక్రమణ దారుల నుండి కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరుపై ప్రజలు ప్రశంశల జల్లులు కురిపిస్తున్నారు.

### అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

గత 30 సంవత్సరాలుగా ఆర్ అండ్ బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు,నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెండు మాసాలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణ నిర్మాణాలను తొలగించడానికి జేసీబీ యంత్రాలతో ప్రయత్నం చెయ్యగా,అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు.దీంతో పోలీసులకు బాధితులకు మధ్య చాలా సేపు తోపులాటతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.స్థానికుడు ఒకరు రేకుల షెడ్ల పైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ పోలీసులను బెదిరిస్తూ హల్ చల్ చేశాడు.దీంతో పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ అతన్ని క్రిందకు దించి మందలించి పంపించివేశారు.

### మా గ్రామంలో మరోసారి గ్రామసభ నిర్వహించండి :ఆర్డీవోకు కౌన్సిలర్ విన్నపం

**విశాలాంధ్ర-పులివెందుల:** మా గ్రామంలో మరోసారి గ్రామసభ నిర్వహించాలని 32వ వార్డు కౌన్సిలర్ (బ్రాహ్మణపల్లి) మూలి గంగామహేశ్వరరెడ్డి ఆర్డీవోకు విన్నవించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చిన్నయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామం బ్రాహ్మణపల్లిలో గురువారం రెవెన్యూ అధికారులు గ్రామ సభ ఏర్పాటు చేశారన్నారు. అయితే అది గ్రామ నౌకరు ఇంటి ఆవరణలో ఏర్పాటు చేయడం ప్రజలకు ఇష్టంలేదన్నారు. గ్రామ సభ నిర్వహించిన ప్రదేశం చాలా మందికి ఆమోదయోగ్యంకాకపోవడంతో గ్రామసభకు చాలా మంది వెళ్లలేదన్నారు. కావున నిబంధనలకు విరుద్దంగా గ్రామ ఏర్పాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

**విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ :** ముందస్తు క్రిస్మస్ వేడుకల సందర్భంగా నగరంలోని ప్రార్థనా మందిరంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ నాయకులు అమీర్‌బాబు పాల్గొని చర్చిలోని ఫాదర్లకు, క్రైస్తవ భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు చెప్పిన విధంగా శాంతి స్థాపన కలగడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రముఖ పారిశ్రామిక వేత్త కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్యను శాలువతో సత్కరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల కార్యక్రమంలో పలువురు ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాను సమర్థిస్తారా..చంద్రబాబుకు జకరయ్య సూటి ప్రశ్న

**విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ :** పార్లమెంటు ప్రాంగణంలో గురువారం అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో జరిగిన తోపులాటలో బాధ్యునిగా చేస్తూ రాహుల్ గాంధీ పై కేసు నమోదు చేయడాన్ని కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య తప్పు పట్టారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గురువారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఎన్డీఏ ఇండియా ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగారు అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు వ్యతిరేకిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదట ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్‌జెడి, ఎన్‌సిపి (శరత్ పవర్) వామపక్షాలు తదితర పార్టీల సభ్యులు నిరసన ప్రదర్శించారన్నారు. అనంతరం ఊరేగింపుగా పార్లమెంటులోకి ఎంపీల ప్రవేశ ద్వారమైన మకర ద్వారం నుంచి లోపలికి వెళ్ళేందుకు అక్కడికి చేరుకున్నారన్నారు. అయితే ఆ సమయంలో మకర ద్వారం వద్ద అధికారపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష ఎంపీలు అటువైపు రావడంతో ఇరువర్గాలు పోటపాటిగా నినాదాలు చేయడం ప్రారంభించాయన్నారు. దీనితో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బిజెపి సభ్యులు కర్రలతో కూడిన

ప్లకార్డును పట్టుకొని ఆ కర్రలతో కాంగ్రెస్ ఎంపీల మీద దాడి చేశారని పార్లమెంట్ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని జకరయ్య చెప్పారు. బిజెపి ఎంపీలు మల్లికార్జున ఖర్గేను తోసివేస్తే అతని మోకాలికి గాయం అయిందని కుంటుకుంటూ సభలోకి వెళ్లారని, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారని చెప్పారు. దీనికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ వీడియో విడుదల చేసిందన్నారు. కాబట్టి మొదటగా తప్పు చేసింది అమిత్ షా అని దానిమీద ప్రజా స్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే బిజెపి ఎంపీలు దౌర్జన్యం చేయడం సరి కాదని తక్షణమే రాహుల్ గాంధీ పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. చంద్రబాబు నువ్వు ఇస్తా నన్న పథకాలు ఇంతవరకు అమలు చేయ లేదని, రాష్ట్రంలో కుంభకోణాలు చోటు చేసుకున్నయని, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు నేతలంతా నీకింత... నాకింత అని పంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు.. ముందు నువ్వు రాష్ట్రం మీద దృష్టి పెట్టు. తర్వాత జాతీయ రాజకీయాల గురించి మాట్లాడు అని హితువు పలికారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సమన్వయకర్త అబ్దుల్ సత్తార్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.

## శివాలయం చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**విశాలాంధ్ర - రైల్వే కోడూరు :** మండల కేంద్రంలోని శ్రీభుజంగేశ్వరస్వామి ఆలయంలో 9 తారీఖున సోమవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు ఉండిని పగులకొట్టి అందులోని నగదు దోచుకెళ్లారని ఇఓ కొండారెడ్డి,అర్చకులు బోయలకుంట్ల పవన్ కుమార్ శర్మ తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నవీన్ బాబు కు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అదేశాల మేరకు రాజంపేట డిఎస్పీ సుధాకర్ అధ్వర్యంలో స్థానిక అర్బన్ సిఐ హెమసుందర్ రావు పర్యవేక్షణలో ముద్దాయిల కోసం పట్టువదలని విక్రమార్కుడులా ఎస్ఐ నవీన్ బాబు అనుమానిత ప్రాంతాలలో అణువణువునా వ్యూహాత్మకంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు శుక్రవారం ఓబులవారిపల్లి మండలంలోని బొమ్మవరం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ నవీన్ బాబు,వారి సిబ్బంది రాజేంద్ర, బాబు రెడ్డి,ఆకేఫ్, చంద్రశేఖర్,బాలాజీ తదితరులు మాటు వేసి ముద్దాయిలు ఓబులవారిపల్లి మండలంలోని బాలిరెడ్డిపల్లికి చెందిన కొమ్మలపాటి గోవర్ధన్,ఐలరాచపల్లికి చెందిన మల్లిబోయిన శివకుమార్ లను పట్టుకుని అరెస్టు చేశారు.వారి నుండి 66,132 రూపాయలు ఉండి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.జిల్లా ఎస్పీ, డిఎస్పీ సిఐ ని,ఎస్ఐ ని, పోలీస్ సిబ్బంది ని ప్రశంసించి అబినందించారు.

## నైతిక విలువలుంటే రాజీనామా చేయండి : వైసీపీ నేతలు

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్:** తెలుగుదేశం పార్టీలో చేరిన కార్పొరేటర్లకు ఏమాత్రం నైతిక విలువలున్నా వైఎస్సార్‌సీపీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, వి. రామక్రిష్ణారెడ్డి, బి. మరియలు, శ్రీరంజన్రెడ్డి,త్యాగరాజు, కార్పొరేటర్లు కె. బాబు, సానపు రెడ్డి శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్ రెడ్డి తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎవరైనా తమ పార్టీకి రావాలంటే రాజీనామా చేసి రావాలని చెప్పారని, అందుకు విరుద్ధంగా కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకోవడం సరికాదన్నారు. టీడీపీకి రాష్ట్రంలో ఓ రూలు, జిల్లాల్లో మరో రూలు ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాటకే వారు విలువ ఇవ్వడం లేదని చెప్పారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన విధంగా ఆ కార్పొరేటర్లు తమ స్వలాభాల కోసం, తమ ఆస్తులను కాపాడుకోవడానికే పార్టీ మారారని ధ్వజమెత్తారు. ప్రజలు వారిని చూసి ఓట్లు వేయలేదని, వైఎస్ఆగన్ను చూసే వారికి ఓట్లు వేశారని గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి తమ పార్టీలో చేరారని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

## కానిస్టేబుల్ వేధింపులు తాళలేక విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**విశాలాంధ్ర-రాయచోటి రూరల్ :** రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్లో పనిచేస్తున్నకానిస్టేబుల్ ధర్మా వేధింపులు తాళలేక విద్యార్థి రామాంజనేయులు గుళికల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రాయచోటి మండలం మాధవరం గ్రామం కంచరపల్లె కాలనీకి చెందిన కలవపల్లి రామాంజనేయులు శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు జీవనాధారం నిమిత్తం కువైట్‌కు వెళ్లారు. గురువారం కానిస్టేబుల్ ధర్మా మాధవరం గ్రామం కంచరపల్లెకు వచ్చి రామంజనేయులను ఇంటి నుంచి బయటకు లాక్కొచ్చి ఓ అమ్మాయి నుంచి బంగారం తీసుకొచ్చావని నానా దుర్భాషలాడినట్లు బంధువులు తెలిపారు. సార్ నాకు ఏమి తెలియదు అని చెప్పిన కూడా కానిస్టేబుల్ ధర్మా వినకుండా కొట్టినట్లు తెలిపారు. వెంటనే రామాంజనేయులు మనస్థాపానికి గురై ఇంటిలోనికి వెళ్లి గుళికల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే బంధువులు రాయచోటిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి సీరియస్ గా ఉందని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే తిరుపతిలోని సంకల్ప ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్ ను వివరణ కోరగా ఆ విషయం నాకు తెలియదని, ఎటువంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. ఈ విషయమై కానిస్టేబుల్ పై జిల్లా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

### ఒత్తిడి లేని జీవితాన్ని అలవరచుకోవాలి :బ్రహ్మకుమారి శివలీల

**విశాలాంధ్ర-కడప కలక్టరేట్ :** ఒత్తిడి లేని జీవిత ప్రయాణాన్ని మను షులు అలవరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్రహ్మ కుమారి శివ లీల అక్కయ్య వెల్లడించారు. శుక్రవారం నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ఒత్తిడి లేని జీవిత ప్రయాణం అనే అంశంపైన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎం టి.రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులో కలుగు అలజడి, ఆందోళనలు తొలగి ప్రశాంతత కలగాలంటే ఒత్తిడి లేని జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ సిబ్బంది, బ్రహ్మకుమారీస్ అక్కయ్యలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో తులసి రెడ్డి

**విశాలాంధ్ర-వేంపల్లి:** చక్రాయపేట మండలం కే.రాజుపల్లి చెందిన లోమడ జగన్ మోహన్ రెడ్డి కుమారుడు కలాదర్ రెడ్డి వివాహం బద్వేల్ టౌన్‌కు చెందిన భవితతో శుక్రవారం వేంపల్లిలో మధురెడ్డి కళ్యాణ మండపంలో జరిగింది.ఈ వివా హానికి మాజీ రాజ్య సభ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి,కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వినయ్,రాజు వధూవరులను ఆశీర్వదించారు.

# డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిక దిగుబడులు

**విశాలాంధ్ర - వల్లూరు :** డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండవలసిన మొక్కల సంఖ్య కచ్చితంగా ఉండటం వల్ల వరి దిగబడులు నాటు వేసిన వారి కన్నా అధికంగా ఉంటాయని కమలాపురం వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లేబక గ్రామంలో రైతు సాగు చేస్తున్న డ్రమ్ సీడర్ వరి పద్ధతిని మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల మూలంగా వర్షాలు సకాలంలో కురువక నాలో కోయడం, నాటు వేయడం ఆలస్యం అవడం వల్ల వరిదేవబడును తగ్గుతున్నాయి. దీనివలన నెల రోజులపాటు పెంచి నారు పీకి నాటు వేయడానికి అధిక ఖర్చు అవ్వడమే కాక నీటి వాడకం కూడా అధికమవుతుంది. ఈ నేపథ్యంలో డ్రం సీడర్ తో వరి సాగు చేయుట ఒక ప్రత్యామ్నాయ పద్ధతి. వర్షాలు ఆలస్యమైన నీరు సకాలంలో అందనప్పుడు కాలువల ద్వారా నీటి విడుదల ఆలస్యమైనప్పుడు ముదురు నార్లతో నాట్లు వేయడం జరుగుతుంది. దీంతో వరిలో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. అలాంటి పరిస్థితుల్లో డ్రం సిడర్ పద్ధతి అణువుగా ఉంటుంది. సాల మధ్యలో యంత్రాలతో అంతర కృషికి వీలుంటుంది నాటు వేసిన వరికన్నా 5బి7 రోజులు ముందుగా డ్రమ్ సీడర్‌తో వేసిన వరి కోతకు ముందు వస్తుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులు

**విశాలాంధ్ర-సంబేపల్లి :** భూ సమస్యలకు పరిష్కార వేదికలు రెవెన్యూ సదస్సులని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవంతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అడవికమ్మ పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి రామరాజు మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు సరిహద్దు, ముటేషన్ అక్రమాలు, తదితర సమస్యలను పరిష్కరించుకోవచ్చని వారు తెలిపారు రైతులు పూర్తిస్థాయి భూ రికార్డులతో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయం అధికారులు కార్యకర్తలు వెంకటరమణ నాయుడు, రమేష్ యాదవ్, రత్నం, వీరయ్య, గోవర్ధన్, డీలర్ వేంకటేశ్వర, బాబు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు

**విశాలాంధ్ర - బద్వేలు :** గోపవరం మండలం మడకలవారి పల్లె లో ఉన్న డా.బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో 'నేచురల్ ఎనర్జీ ఎకనామిక్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపల్ సునిత అధ్యక్షతన విద్యార్థులకు జరిగింది. ఈ సంబర్భంగా విద్యుత్‌శాఖ యం.చిన్నయ్య విద్యార్థులకు ఇంధన పొదుపు, ఇంధన వనరుల వినియోగం వల్ల కలిగే లాభ నష్టాలు గురించీ విద్యార్థులకు వివరించారు. సహజ వనరుల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ మార్గాలైన సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ వంటి వాటి వినియోగించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విద్యార్థుల చేత ప్రతి యునిట్ వృధా కాకుండా వినియోగించుకుంటామని ప్రమాణం చేయించారు. ఈ కార్యమానికి నేచురల్ ఎనర్జీ ఎకనామిక్ డివలప్మెంట్ సొసైటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 22న బెంగుళూరులో పూర్వ విద్యార్థులు కలయిక

**విశాలాంధ్ర-మదనపల్లె:** మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వారు పూర్వ విద్యార్థులు కలయికను ఆదివారం 22వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. మిట్స్ అలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా బెంగళూరు లోని దేవరబిసనహళ్లి, బెల్లందూర్‌లోని ఐకాన్ ప్రీమియర్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. ఈ సమావేశానికి కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. తమ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థలలో ముఖ్యంగా అత్యుత్తమ మల్టీనేషనల్ కంపెనీలలో వివిధ రాష్ట్రాలలో పనిచేస్తున్నారని, అంతేకాకుండా ఎంతో అత్యుత్తమ స్థానాలలో ఉన్నారని, వారికి ఒక సమావేశాన్ని ఏర్పాటు కొరకై ఈ సమావేశాన్ని బెంగళూరు లో నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొనాలని, వారి జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి,వారి ఆల్మా మేటర్ యొక్క ప్రతిష్టాత్మకమైన జ్ఞాపకాలను పునరుద్ధరించడానికి హృదయపూర్వక అవకాశం అని ఆయన అన్నారు.

# పి.ఎఫ్ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

### జిల్లా పరిషత్ సీఈఓను కోరిన ఎస్టీయు కడప జిల్లా శాఖ

**విశాలాంధ్ర-కడప రూరల్ :** కడప జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి ఒక సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించి స్పెషల్ డ్రైవ్ ద్వారా దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ కడప జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఓబులమ్మని కోరింది. శుక్రవారం సీఈవో చాంబర్లో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీఈఓని కలిసి ఉపాధ్యాయుల పిఎఫ్ సబ్‌స్క్రిప్షన్ మిస్సింగ్ క్రెడిట్లను, అలాగే ఫైనల్ పేమెంట్లు చెల్లింపు విషయంలో ఆడిట్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు అలాగే ఉపాధ్యాయుల అవసరార్థం దాచుకున్న సొమ్మును లోన్ రూపంలో పొందడానికి చేసుకున్న దరఖాస్తులు పరిశీలన విషయంలో జరుగుతున్న ఆలస్యంపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా త్వరలో ఒక కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను సేకరించి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ భాష, నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, రమణారెడ్డి, బాల గంగిరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్,పాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు అడ్డంగా పడుకున్న ఆవులు..పట్టించుకోని అధికారులు

**విశాలాంధ్ర-రామపురం:** కర్నూలు -చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు వద్ద ఆవులు రహదారిపై పడుకోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆవులు యజమా నులు పట్టించకపోవడంతో గతంలో ప్రమాదానికి గురై చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ఆవులు రోడ్డుపై బైఠాయించడంతో వాహనదారులు ఆవులను గమనించకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఆవులు దుకాణాలపై పడి లాక్కొని తినడం మనుషుల మీదకి పడడం వంటివి జరుగుతున్నాయని దుకాణ యజమానులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బస్టాండ్ జాతీయ రహదారిపై ఆవులు లేకుండా యజమానులకు అప్పగించాలని పలువురు కోరారు.

## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

**విశాలాంధ్ర - వల్లూరు :** ఎరువుల దుకాణం దారులు ఎరువులు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్మ రాదని కడప వ్యవసాయ శాఖ సంచలకు శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వల్లూరులో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే గోడౌన్లో ఉన్నటువంటి ఎరువుల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల నిలువలు, ఈ ఫోర్స్ మిషన్ నిల్వలు స్టాక్ రిజిస్టర్లో బ్యాలెన్స్ వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలు ,పురుగు మందులు మాత్రమే అమ్మాలన్నారు. ప్రతి ఒక్క ఎరువుల దుకాణదారుడు షాప్‌లో స్టాక్ బోర్డులో ఎరువుల ధరలను రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌనం స్వామి పుట్టినరోజు వేడుకలు

**విశాలాంధ్ర - మైదుకూరు :** మైదుకూరు మున్సిపాలిటీ వనిపెంట రోడ్డు ఎర్ర చెరువు దగ్గర ఉన్న మౌనం స్వామి 66వ పుట్టినరోజు సందర్భంగా ఘనంగా భక్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ముందుగా శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు చేసి ఆయన ఆశీస్సులు పొందారు. అనంతరం శిష్య బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో శిష్య బృందం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల పనితీరుపై పరిశీలన

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** మండల పరిధిలోని తిప్పలూరు గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై శుక్రవారం మండల పరిషత్ అధికారి వెంకట రమణయ్య పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది బయోమెట్రిక్, హాజరు రికార్డును పరిశీలించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వివిధ సర్వేలపై ఎంపీడీవో వెంకటరమణయ్య ఆరా తీశారు. సచివాలయ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

## ప్రతి రైతు సమస్య, పరిష్కారం చేస్తాం : మాధవి లత

**విశాలాంధ్ర- సిద్ధవటం :** భూ సమస్యలపై,అర్జీ సమ ర్పించిన ప్రతి రైతు సమస్య పరిష్కారమే రెవిన్యూ సదస్సు కార్యక్రమం అని ఇంచార్జ్ మండల తాసిల్దార్ మాధవి లత అన్నారు. మండలంలోని, కనుమలోపల్లి, రెవిన్యూ ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం రెవిన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేసిన ప్రతి రైతు సమస్య పరిష్కారం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరు సద్వి, సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్,సుదర్శన్, విఆర్ఓ శ్యాంబాబు సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## స్పందనలో ఫిర్యాదు దివ్యాంగురాలికి న్యాయం జరిగేనా..!

### -స్పందనలో స్పందన లభించేనా..!

**విశాలాంధ్ర-సిద్దవటం :** ఇంటి స్థలం ఆచూకీ కొరకు ఆన్లైన్ స్పందనలో డిసెంబర్ 13వ తేదీన మాధవరం-1 సచివాలయం -2 లో దివ్యాంగురాలు పాలెంపల్లె సునీత ఫిర్యాదు చేశారు. మండలంలోని మాధవరం-1 అలీ నగర్ గ్రామ నివాసి దివ్యాంగురాలు పాలెంపల్లి సునీత గత 2017 లో ఇంటి నిర్మాణం కొరకు పెద్దపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 1068 /4 ప్లాట్ నెంబర్ 95 నిర్దేశించి ఇంటి నివాస ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాధవరం-1 పంచాయతీలోని ఎస్.కే.ఆర్ నగర్ గ్రామ సమీపంలో ఉన్న మేడా రామకృష్ణారెడ్డి చేనేత కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలం కేటాయించిన ప్రదేశంలో కొంతమంది స్థలాలు ఆక్రమించుకున్నారని తమకు కేటాయించిన స్థలం ఎక్కడో తెలియక ఆన్లైన్ స్పందనలో డిసెంబర్ 13న ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై అధికారుల సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలన్నారు. స్థల విషయంలో పరిష్కారం కానీ ఎడల కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## ఒంటిమిట్ట చెరువుకట్టపై కారు- బైకు ఢీ

**విశాలాంధ్ర - ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట చెరువుగట్టు పై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది ఈ ఘటనలో కారు బైకు ఢీకొన్నాయి ఒంగోలు చెందిన బిఎస్ ఫణీంద్ర కుమార్ అనే వ్యక్తి కారు చెరువుకట్టపై ఢీకొట్టింది ఈ ప్రమాదంలో బైకులొ ప్రయాణిస్తున్న వ్యక్తి గాయపడ్డాడు చికిత్స నిమిత్తం అతని కడప ఆసుపత్రి తరలించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

విశాలాంధ్ర-సిద్ధవటం : మండలంలోని టక్కోలి గ్రామ నివాసి నేలటూరి వెంకట ప్రవీణ్ అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ ఇన్చార్జ్ బాలసుబ్రమణ్యం మాధవరంలో మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలకు అందిస్తున్నామని (సీఎంఆర్ఎఫ్ ద్వారా) రూ.8,000 బాధితునికి అందించడం జరిగిందని అన్నారు.

## విశ్రాంత ఉద్యోగి మృతి

విశాలాంధ్ర- సిద్ధవటం : తిరుపతి పద్మావతి హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటూ శుక్రవారం మధ్యాహ్నం రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందాడు. సిద్ధవటం, గ్రామం, నందు నివాసం ఉన్న పాలగిరి రామ్మూర్తి రాజు (63) రిటైర్డ్, పోస్ట్,మాన్, మృతి చెందాడు గుండె నొప్పితో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అంత్యక్రియలు వారి స్వగృహం వద్ద శనివారం జరుగుతాయని అన్నారు.

## అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి

విశాలాంధ్ర-కొండాపురం: రాజ్యాంగ నిర్మాత, దళి తుల ముద్దు బిడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ మరియు విగ్రహావిష్క రణకు స్థలం కేటాయించాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు మరియు విపల పక్షం ఆధ్వర్యంలో శుక్రవారం రోజు మండల కేంద్రమైన కొండాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న కార్యాల యం వెలుపల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి స్థలం మంజూరునకు ప్రయ త్నం చేస్తున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీ నామా చేసి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొండాపురంలో ఇంటి స్థలం లేని పేదలకు స్థలం కేటా యించి పట్టాలు ఇవ్వాలని, గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల భూములు కోల్పోయి రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. కావున ప్రతి కుటుంబా నికి భూములు పంపిణీ చేసి, ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మనో హర్ బాబు, ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు, పి.వెంకటరమణ, దళిత నాయకులు నాగ సుబ్బ రాయుడు, శ్రీనివాసులు, గంగాధర్, పెద్దన్న, నాగన్న పాల్గొన్నారు.

# బ్రౌన్ గ్రంథాలయానికి వంద పుస్తకాల బహూకరణ

విశాలాంధ్ర-కడప వైవీయూ : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వై. సుబ్రహ్మణ్యం 100 పుస్తకాలను శుక్రవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణలకు అందజేశారు. ఈ సంద ర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వై.సుబ్రహ్మణ్యం బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో శ్రీవాల్మీకి మహర్షి ప్రణీతమ్ శ్రీమద్రామాయణమ్ (యుద్ధకాండం), ముకుందమాల భక్తితత్వం, శ్రీ సింహాద్రి నారసింహ శతకం, మాతృదర్శనం, టూకీగా ప్రపంచ చరిత్ర, సిరికోన భారతి, మహాభారతానుశీలనం, శ్రీమద్ భాగవతం- నవమ స్కంధం, గృహవైద్యం, హృదయం నీ నామం, శ్రీ అరుణాచలేశ్వరం, తెలుగు వ్యాకరణం తదితర గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన వై. సుబ్రహ్మణ్యంను యోగి వేమన విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు : చమర్తి

విశాలాంధ్ర-నందలూరు : ప్రజా సమస్యలపై అలస త్వం వహించవద్దు అని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.శుక్రవారం నాడు మండలం లోని టీవీ పురం నందు రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని,కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని, అలాగే అధికారులు కూడా ప్రజా సమస్యలపై అలసత్వం వహించవద్దని,పరిష్కార మార్గాలు ఉండే వాటిని తక్షణమే పరిష్కరిస్తూ ఏవైనా సమస్యలు ఉంటే అర్జీదారులకు స్పష్టంగా వివరించాలని ఆయన సూచిం చారు. ఈకార్యక్ర మంలో తాసి ల్దార్ అమర్నా థ్, ప్రభుత్వ అధికారులు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల పార్టీ అధ్య క్షులు జంగం శెట్టి సుబ్బ య్య, టి డి పి అధికార ప్రతినిధి పరశురాం నాయుడు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మ ణ్యం నాయుడు, గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు, గోపాల్ రాజు, రామాంజి, గంగన్నపల్లె శ్రీనివాసులు,సురేష్ రాజు పాల్గొన్నారు.

# కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు విద్యార్థినీ విద్యార్థుల కోసం కెరియర్ గైడెన్స్ అంశంపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలని మరియు గమ్యాన్ని చేరడానికి అంకిత భావం ,కృషి ,పట్టుదల మరియు మంచి నడవడికతో అడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అకాడమిక్ అంశాలతో పాటు కో కరికులం ఆక్టివిటీస్ కూడా విద్యార్థుల కెరియర్ని దిశా నిర్దేశం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఇంటెన్షిప్స్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ ,వర్క్ షాప్స్ సెమినార్స్ వంటి కోకరికులం అంశాలపై శ్రద్ధ కనబరిచి ప్రస్తుత ఇండస్ట్రీ డిమాండ్ స్థాయిని చేరుకోవాలని సూచించారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్ ,అర్థమెటిక్ మరియు రీజనింగ్ అంశాలపై అందిస్తున్న ప్రత్యేక శిక్షణను కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని కళాశాలలో నిర్వహిస్తున్న ప్రతి అవగాహనా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ వివిధ విభాగాల అధిపతులు ,అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

### శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ మాధవి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఉర్దూ మీడియం పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి శుక్రవారం నగరంలోని ఉర్దూ గర్ల్స్ హైస్కూల్లో ఆమె ఉర్దూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కొరత ఉందన్న తెలిసి ఇటీవల అసెంబ్లీ లో మాట్లాడి రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ విద్యార్థులకు టెక్స్టుబుక్స్ కొరత ఉన్న విషయాన్ని ప్రస్తావించడమే కాకుండా మంత్రి లోకేష్ కు వివరించి తమ సమస్యను పరిష్కరించమన్నారు. మా కొరకు మా భవిష్యత్తు కొరకు సహకరించిన ఎమ్మెల్యే మాధవి రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ట్లు విద్యార్థులు తెలిపారు. అనంతరం కడప ఉర్దూ గర్ల్స్ హై స్కూల్ ఉద్యార్థులు శాసనసభ్యురాలు మాధవి ని, మరియు గతంలో తమ స్కూల్ అభివృద్ధికి ఎంతో సహకరించిన జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి ని ఘనంగా సత్కరించారు. వీరివురు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సహాయ సహకా రాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆర్టీఐ విభాగ జిల్లా అధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి నియామకం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :వైఎస్ఆర్సీ పి జిల్లా అనుబంధ విభాగా లైన సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది,వెల్లాల రామకృష్ణారెడ్డిని నియమించినట్లు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వైయస్సార్సీపి పార్టీకి చేసిన సేవలను గుర్తించి నా మీద నమ్మ కంతో ఈ పదవికి నన్ను నియమించి నందుకు వైఎస్ఆర్సిపి జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డికి, కడప ఎంపీ అవినాష్ రెడ్డికి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకి, నగరం మేయర్ సురేష్ బాబుకు నా తోటి కార్పొ రేటర్ల అందరికీ పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలి పారు. అలాగే మమ్మల్ని గుర్తించి పదవి ఇచ్చినందుకు ఎల్లవేళల తమవంతు కృషి చేస్తామని 44వ డివిజన్ కార్పొరేటర్ వెల్లా ల హేమలత డివిజన్ ఇంచార్జ్, ప్రముఖ న్యాయవాది వెల్లాల రామకృష్ణారెడ్డి తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి

విశాలాంధ్ర-గాలివీడు: విద్యుత్ తీగలు తగిలి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలోని చోటు చేసుకుంది. పెద్దూరుకు చెందిన రియాజ్ అహమ్మద్ పాడి ఆవు శుక్రవారం మేతకు వెళ్లిన క్రమంలో పెద్దూరు పక్కనే వరి మళ్ళలో ఉరుసు జరిగే ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడింది. డిస్క్ కట్ అయిన కారణంగా క్రిందకు వ్రేలాడుతూ ఉండటంతో ప్రమాదవశాత్తు పాడి ఆవుకు తగిలి మృతి చెందినట్లు సమాచారం.మరో ఇరవై రోజుల్లో పాడి ఆవు ప్రసవించాల్సి ఉండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ తీగల ధాటికి దూడ,ఆవు విగత జీవులై పడివుం డటం చూపరుల హృదయాన్ని కలిచివేసిం ది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


**e-Procurement Tender Notice**
**Rajampet Municipality**

| S. No | e-Procurement Notice No | Number of Works | Estimate Contract Value (In Lakhs) |
|---|---|---|---|
| 01. | 64/GF/DEE/AE/2024-25 to 66/GF/DEE/AE/2024-25 | 3 | 17.01 |
| 02. | Bid Document Download Start date | 21-12-2024 10.00AM | |
| 03. | Bid Document Download End Date | 04-01-2025 3.00PM | |
| 04. | Last Date of receipt of Tender | 04-01-2025 3.30 PM | |

Further details can be seen @ e-Procurement Market Place in https://tender.apeprocurment.gov.in/Contract No.998905251971.

Sd/-Commissioner,Rajampet Municipality



**బంగారు నగల వేలం ప్రకటన**

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.21-12-2024 శనివారం ఉ॥ 11 గం॥లకు మదనపల్లి బ్రాంచ్ నందు 84.00 గ్రాములు కుదువ పెట్టిన పాత బంగారు నగలు మా బ్రాంచ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయిన నందున, వారందరికి మా వేలం పాట ప్రకటనలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంట తీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై నిబంధనల కొరకు దయచేసి మా హెడ్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

**B.O.అరుణా ఫైనాన్స్ లిమిటెడ్**
డోర్ నెం. 3/146-B-5, ఖాదిరి రోడ్, టొమాటో మార్కెట్ ప్రక్కన, నీరుగుట్టవారిపల్లి, మదనపల్లి-517325, అన్నమయ్య జిల్లా.
సెల్: 88851 22377

## అర్హులందరికీ పెన్షన్లు

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందే విధంగా చర్యలు తీసు కుంటామని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి అన్నారు శుక్రవారం ఐదవ డివిజన్ అశోక్ నగర్ పరిధిలోగల జోగు పద్మావతి భర్త జోగు సుభాష్ మరణించిన విషయం తెలుసుకొని జోగు పద్మావతికి మరణ ధ్రువీకరణ పత్రము మంజూరు చేయించి జోగు పద్మావతి భర్త పెన్షన్ తీసు కుంటూ మరణించినందున వారి కుటుంబ ప్రయోజనం కొరకు వితంతు పింఛన్ జోగు పద్మావతి కిమంజూరు చేస్తూ కొత్త వితంతు పెన్షన్ ధ్రువీకరణ పత్రంనీ అందించామన్నారు.ఈ కార్యక్రమం లో బోనం శిలాసు టిడిపి నాయకులు బోనం అబ్రహం, మండల సుబ్బారావు, మొలయన్ సెల్వకుమార్, మజారి శివ, ఆనంద్ పాల్గొన్నారు.

## రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్‌గా బద్వేల్ మస్తాన్ బాష

విశాలాంధ్ర–నందలూరు : సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ గా నందలూరుకు చెందిన బద్వేల్ మస్తాన్ భాషను ఎంపిక చేశారు. 54వ ఆన్యువల్ జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 19, 20 తేదీ లలో సికింద్రాబాద్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో మస్తాన్ భాష లోకో పైలెట్ ను గుంతకల్ డివిజన్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం జరిగింది. ఈయన యూనియన్ అభివృద్ధి కొరకు, తోటి కార్మికుల శ్రేయస్సు కొరకు ఎంతో పాటుబడ్డారు. ప్రస్తుతం ఈయన రేణిగుంట లోకో పైలెట్‌గా, గుంతకల్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. గతంలో డివిజనల్ ప్రెసిడెంటుగా పనిచేసిన కె.సుదర్శన్ రాజు పదవి విరమణ కావడంతో ఆయన స్థానంలో మస్తాన్ భాష ను ఎన్ను కున్నట్లు జోనల్ కమిటీ వారు తెలిపారు. డివిజనల్ ప్రెసిడెం ట్‌గా ఎన్నిక అయిన్నందుకు నందలూరు బ్రాంచ్ సెక్రటరీ కె.విశ్వనాథ్, చైర్మన్ పి.గోపీనాథ్, మజ్దూర్ యూనియన్ కార్మికులు, నందలూరు ప్రజలు అభినందనలు తెలిపారు.

## హత్య కేసులో నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర–కొండాపురం: కొండాపురం మండలంలోని లావనూరు నుండి వెంకయ్య కాల్వ వెళ్లే మార్గ మధ్యలో నల్ల వంక సమీపంలో ఈ నెల 17వ తేదిన ఉదయం 6గంటల ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో అనంతపురం గ్రామానికి చెందిన చిన్న గుళ్లోబన్న గారి సురేష్ మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు బాలయ్య ఫిర్యాదు మేరకు కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కొండాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ రఫీ, సబ్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్‌లు సిబ్బందితో కలిసి కేసు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పోలీసుల వివరాల మేరకు మృతుని భార్య వీరకుమారి యల్లనూరు గ్రామానికి చెందిన గజ్జప్ప గారి బాబుతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భార్యను సురేష్ మందలించడంతో పుట్టింటికి వెళ్లి ప్రియునితో కలిసి హత్యకు కుట్ర పన్నింది. ప్రియుడు సురేష్ యల్లనూరు గ్రామానికి చెందిన వెలిదండ్ల సుబహాన్‌కు ఒక లక్ష, చుక్కలూరు కిరణ్‌కుమార్‌కు 50వేలు ఒప్పందంతో 16వ తేది రాత్రి సుభాన్ పుట్టినరోజు కొండాపురంలో ఉందని చెప్పి బొలేరో వాహనం లో ఎక్కించుకొని మద్యం మత్తులో వాహనంలో తాడుతో గొంతుకు తాడు బిగించి చంపివేశారు. హత్య చేసిన ముద్దాయి లు 19వ తేదిన సుగుమంచిపల్లె గ్రామ రెవెన్యూ అధికారి పెద్దన్న వద్ద లొంగిపోవడంతో ఆయన కొండాపురం పోలీసుల కు అప్పగించారు. అరెస్ట్ చేసిన 4 నిందితులను జమ్మలమడుగు కోర్టులో ప్రవేశపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తిగత మరుగుదొడ్ల జియో టాకింగ్ వందశాతం పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర–రాయచోటి: జిల్లాలో ప్రణాళిక బద్ధంగా ఇండ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లాలో ఇండ్ల నిర్మాణ ప్రగతి, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, వ్యక్తిగత మరుగుదొడ్ల జియో టాగింగ్ అంశాలలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డి.ఈ, ఏఈ, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిఆర్డిఏ ఏపీఎం, డ్వామా ఏపిఓ, పంచాయతీ సెక్రెటరీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఒక గూడు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇప్పటికే ఇండ్లు మంజూరై వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి. వారం వారం స్టేజీవారీగా ఇండ్ల నిర్మాణంలో తప్పనిసరిగా ప్రగతి సాధించాలి. విధుల పట్ల బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హౌసింగ్, డిఆర్డిఏ డ్వామా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే గృహ నిర్మాణంలో ప్రగతి సాధ్యమవు తుం దన్నారు. ఇక్కడ సమన్వయం కొరవడరాదని, ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. వచ్చేవారం మరలా సమీక్షిస్తామని, అప్పటికి స్టేజి వారి ప్రగతి సాధించని వారిపై తప్పని సరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్, డిఆర్డిఏ పీడీలు శివయ్య, సత్యనారాయణ, జీవిఎస్బ్యూ ఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ డి.ఈ,ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపిఎం, ఏపీవో, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లె పంచాయతీలో అంతా అవినీతే

### వైస్ చైర్మెన్ బంగారు రెడ్డి

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: కొత్తపల్లె పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులలో అంతా అవినీతి మయం అని వైస్ చైర్మెన్ బంగారు రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పా టుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి నీతి వాక్యాలు చెపుతూ అవినీతి అధికారు లుంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలనడం అవినీతి అధికారులకు వేయించుకు నింది వరదే కదా అని ఎద్దేవా చేశారు. ప్రతి కార్యాల యంలో అవినీతి రాజ్యం ఏలుతోందన్నారు. కొత్తపల్లె పంచాయతీలో కోటి 50లక్షలలో అభివృద్ధి పనులు జరుగుతున్నా యని, ఆయా అభివృద్ధి పనులు ఎంత మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో తెలపాల న్నారు. అభివృద్ధి మాటున జరిగే అవినీతి పెద్దాయన వరదకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఈ సమావే శంలో ద్వార్షల గురునాథ రెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

# దాల్మియా నుండి రైతులను కాపాడండి

### ఆర్డీఓ ను కోరిన ఎమ్మెల్సీ పిఆర్

విశాలాంధ్ర –మైలవరం : మండలంలోని చిన్న కొమర్ల గ్రామంలో వున్నా దాల్మియా సిమెంట్ పరిశ్రమ నుండి దుగనపల్లె మరియు నవాబుపేట గ్రామాలలోని రైతులను కాపాడా లని జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు లోని ఆర్డీఓ కార్యాలయంలో దుగనపల్లె మరియు నవాబుపేట గ్రామాలకు చెందిన రైతులతో కలిసి వారి సమస్యలను ఆర్డీఓ కు తెలిపారు. దాల్మియా సిమెంట్ పరిశ్రమ వారు చేపట్టే పేలుళ్లతో నివాసాలు, పంట పొలాలు సైతం నష్టపోవడంతో పాటు పరిశ్రమ నుంచి వెలువడే పొగతో అనారోగ్యం బారిన పడుతున్నా రని కాబట్టి దాల్మియా పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోని నష్టపో యిన రైతులకు దాల్మియా పరిశ్రమ నుండి నష్టపరిహారం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవా లని కోరారు.రైతుల సమస్యలను దాల్మియా యాజ మా న్యం దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నా రు. దుగనపల్లె మరియు నవాబుపేట గ్రామాలలో పర్యటించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. ఆర్డీఓ ను కలిసిన వారిలో మాజీ ఎంపిపి పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి, వైకాపా రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి మరియు దుగనపల్లె మరియు నావాబుపేట గ్రామాలకు చెందిన రైతులు వున్నారు.

# డైమండ్ షోను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్ :ప్రముఖ బం గారు, వజ్రాభరణాల విక్రయ సంస్థ మలబార్ ఏర్పాటు చేసిన మైన్ లైట్ వెయిట్ డైమండ్ షోను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడపకు చెందిన మహిళా వైద్య నిపుణులు డాక్టర్లు శిరీష, హరిత, సునీతలు పిలుపునిచ్చారు. శు క్రవారంకడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లోగల మలబార్ షోరూంలో ఏర్పాటు చేసిన మైన్ లైట్ వెయిట్ డైమండ్ షోను వారు ప్రారంభించి మాట్లాడారు. 1993లో ఏర్పాటు చసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ దేశంతోపాటు ప్రపంచంలోనే విశేష గుర్తింపు కలిగి ఉందన్నారు. మన దేశంతోపాటు మిడల్ ఈస్ట్, ఫార్ ఈస్ట్, యూఎస్ఏ, యూకే, కెనడ, ఆస్ట్రేలియా వంటి 13 దేశాలలో కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు, హోల్‌సేల్ యూనిట్లు, ఫ్యాక్టరీలతోపాటు 370 షోరూములు కలిగిన సంస్థగా మలబార్‌గా విశేష గుర్తింపు ఉందన్నారు. అటు వంటి సంస్థ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన మైన్ లైట్ వెయిట్ డైమండ్ షో ఈనెల 20 నుంచి ఐదురోజులపాటు కొనసాగుతుందన్నారు. ఆభరణాల నాణ్యత, మన్నిక, ఆధునిక డిజైన్లకు మారుపేరుగా ఉంటున్న సంస్థగా మలబార్‌గా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి ఆభరణాలు రోజువారిగా ధరించడానికి, ప్రత్యేక సందర్భాల్లో ధరించేందుకు నైపుణ్యంతో కూడినవిగా ఉన్నాయని తెలిపారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఆభరణాలు అందుబాటులో ఉంచారని, ఈ అవకాశాన్ని ముఖ్యంగా మహిళా మణులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం ప్రతినిధులతో పాటు సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## పలు వార్డులలో కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: మున్సిపల్ కమిష నర్ వి.మల్లికార్జున పట్టణ పర్యటనలో భాగంగా శుక్రవారం నాడు పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జిన్నా రోడ్డు మోటు వద్ద ఉన్న కాలువ యందు సిల్ట్‌ను పారిశుద్ధ్య కార్మికులచే తొలగించారు. అలాగే గాంధీ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా వద్ద ఉన్న కాలువ యం దు తొలగించిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మి కులచే శుభ్రం చేశారు. వెంకటేశ్వరుల పేట నందు కాలువ యందు పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులచే తొలగిం చారు. అలాగే శ్రీరామ్ నగర్ వీధి నందు ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ యస్.నూర్ బాష పాల్గొన్నారు.

## నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర–కడప వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం లో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా కుల సచివు లు ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, చిన్మయ మిషన్ అధ్యక్షులు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణా నిపుణులు ఎం.నాగూర్ బాబు హాజర వుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదువులు సాగిస్తూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

## నేడు అన్నదానం

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, కృష్ణాలయం కమిటీ చైర్మెన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యం లో శనివారం మధ్యాహ్నం పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పదోన్నతి పొందిన పోస్టల్ సిబ్బందికి సన్మానం

విశాలాంధ్ర –సుండుపల్లె: మండల కేంద్రం లోని పోస్ట్ ఆఫీస్ లో పనిచేయు మునిరత్న, భాస్కర్, రెడ్డిశేఖర్ లు న్యూఢిల్లీ పోస్టల్ సర్కిల్ కు పదోన్నతి పై వెళ్లుతున్న సందర్భంగా వారికి ఘనంగా పోస్టల్ సిబ్బం ది సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లా డుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పనిచేసి పదోన్నతి పై న్యూఢిల్లీ ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకో వాలని అన్నారు ఈ కార్యక్ర మంలో రాయ చోటి పోస్టల్ ఇన్స్పెక్టర్ కే అమర్నాథ్, సుండుపల్లె పోస్టుమాస్టర్ సురేష్ , సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు



విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని సిఎస్ ఐ ప్రార్థనా మందిరంలో శుక్రవారం రాజు వివాహం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి పులివెందుల ప్రాంత కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వేలూరు శ్రీనివాసరెడ్డి, కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, శివ లు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వాదించారు. పది కాలాల పాటు చల్లగా ఉండాలని నూతన జంటను వారు దీవించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పీలేరు: పీలేరు నియోజవర్గ స్థాయిలో ప్రమాదాలు, అనారోగ్యం భారిన పడి మంచం పట్టిన అర్హులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 12 మందికి చెక్కులు అందజేసిన,తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అనారోగ్యంతో కొంతకాలంగా మంచం పట్టిన వారికి వైద్య ఖర్చులు నిమిత్తం ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆశ్రయించడంతో ముఖ్యమంత్రి పేషీ నుండి నిధులు మంజూరు చేశారు. నిధులు రావడంతో కలికిరి తమ స్వగ్రామం నగిరిపల్లి లో శుక్రవారం బాధితులకు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చెక్కులు పంపిణీ చేసి బాధితులకు ఊరట కల్పించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టిందని భవిష్యత్తులో మరిన్ని పథకాలు ప్రజలకు చేరువవుతాయని ఆయన తెలిపారు.అర్హులైన వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేసుకున్నందుకు టిడిపి పార్టీ తరపున చెక్కులు రావడం సంతోషకరమని కిషోర్ కుమార్ రెడ్డికి అందరూ ధన్యవాదాలు తెలిపారు.

## జూదరుల అరెస్టు

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండల పరిధిలోని చింతలమడుగుపల్లి సమీపంలో జూదమాడుతున్న ఏడు మందిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించగా జూదమాడుతున్న వారిని గుర్తించారన్నారు. జూదరుల అరెస్టుతో పాటు రూ. 2300లు నగదును సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

## సిఎన్ఆర్ కాలేజీని వరించిన జాతీయ అటల్ అఛీవ్‌మెంట్ అవార్డు

విశాలాంధ్ర- పీలేరు : టాప్ నోచ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీ లో జరిగిన అటల్ సమ్మాన్ సమరోహ్ కార్యక్రమంలో ఆజ్ తక్, ఇండియా న్యూస్ మరియు మేడ్ గేట్ టుడే సంయుక్తంగా నిర్వహించిన అటల్ అఛీవ్-మెంట్ అవార్డు 2024 కి గాను ఉత్తమ సేవలు అందించిన వివిధ రంగాల వారికి ఎక్సలెన్స్ అవార్డులను అందించారు. ఆంధ్రప్రదేశ్ నుండి విద్యా రంగంలో పీలేరు లోని సిఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కి "నేషనల్ అవార్డ్ ఫార్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ" అవార్డును ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాంపాల్ మేఘవాలే, గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఖాన్ సాహు, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్స్, ప్రముఖ నటి కాజల్ అగర్వాల్,రాజస్థాన్ మాజీ గవర్నర్ కలరాజ్ మిశ్రా మరియు ఎన్డీవి ఇటలీకి ప్రెసిడెంట్ మరియు సీఈఓ రోసా బరోనిల చేతులు మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి విలేకరుల సమావేశంలో అన్నారు. సిఎన్ఆర్ కాలేజీ కి ఈ అవార్డు రావడం ఆనందం ఉందని మరింత భాధ్యతగా నాణ్యమైన విద్యను అందించే విధంగా శ్రమిస్తామని విలేకరుల సమావేశంలో కాలేజీ కరెస్పాండెంట్ చింతల విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి తోడ్పడిన ప్రిన్సిపాల్ & డైరెక్టర్ డాక్టర్ లావణ్య మరియు అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



విశాలాంధ్ర- పీలేరు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులువిశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావువిగ్రహ ప్రతిష్టాపనకు సహకరిస్తామని పీలేరు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ఎన్టీఆర్ నఫీస్ గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషన్ కుమార్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు త్వరలో అనువైన స్థలాన్ని ఎంపిక చేయిస్తామని మరియు విగ్రహ ప్రతిష్టాపనకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని ఎన్టీఆర్ నఫీస్ అన్నారు.

# ఆవరించిన మబ్బులు - కష్టాల కడలిలో రైతులు

విశాలాంధ్ర–తొండూరు: ఆరుగాలం కష్టించే రైతన్నకు ప్రకృతి వైపరీత్యాలు ఏదో ఒక రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. ఏ పంట వేసినా గట్టెక్కుదామన్న నమ్మకం అన్నదాతల్లో సన్నగిల్లింది. దిగుబడి సక్రమంగా ఇంటి వస్తుందన్న ఆశలు కూడా ఆవిరవుతున్నాయి. ఇందుకు రోజుల తరబడి ఆవరించిన మబ్బుల కారణంగా శనగ రైతు కష్టాల కడలిలో ఎదురీదుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సాగు సాగు చేసిన పప్పుశనగ పంట ఆడియాశలకు గురిచేసింది. పులివెందుల నియోజకవర్గ పరిధిలో అధిక విస్తీర్ణంలో శనగ పంట సాగు చేశారు. విత్తనం వేసి నెలన్నర కావస్తోంది. పైరు కూడా ఏపుగా పెరిగింది. త్వరలో దిగుబడి చేది కందుతుందన్న రైతన్నల ఆశలు ఆవిరయ్యాయి. దీంతో శనగ పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశ ఎదురైంది. కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి దాపురిం చిందని రైతులు చెబుతున్నారు. ఆశలన్నీ అడియాసలు కావడంతో శనగ రైతు పరిస్థితి దయనీయంగా మారింది. కార్తీక మాసం నుంచి మొదలైన మబ్బులు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. మరోవైపు చలి తీవ్రత ఎక్కువ కావడంతో శనగ పైరుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో రైతులు శనగ పంటపై ఆశలు వదులుకున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన శనగ రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదిశగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ పై కూటమి ప్రభుత్వం కసరత్తు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు నియోజకవర్గ స్థాయిలో తమ తమ గ్రామ, పట్టణ శివారుల్లో చెరువులు కింద భూములున్న రైతులు సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారందరూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శుక్రవారం కలికిరి ఎమ్మెల్యే స్వగ్రామం నగిరిపల్లిలో నియోజకవర్గ స్థాయిలో రైతులు చేరుకొని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డిని కలిశారు.ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రైతులు వ్యవసాయం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పంట నష్టం కలిగితే పరిహారం ఇవ్వలేదని, నాణ్యమైన విత్తన సరఫరా చేయలేదని, రైతులు పండించిన పంటలు దిగుబడి తగ్గితే సమీక్షలు చేయలేదని ప్యాలెస్ నుండి ఒక్క అడుగు బయటపెట్టి ఒక రైతుతో అయినా మాట్లాడి కష్టాలు తెలుసుకున్న పాపాన పోలేదని అన్నారు.సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఉపాధ్యక్షులను ఆయన సూచించారు.గత ప్రభుత్వంలో దారి తప్పిన వ్యవస్థలను గాడిలో పెడుతూ గడచిన ఆరు నెలల్లో అందరికీ సంక్షేమాలు అందిస్తూ అభివృద్ధిని చూపిస్తూ కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు మెచ్చు కుంటున్నారని ఆయన రైతులకు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు భూమి ఉన్న రైతులకు ప్రతి సంవత్సరం 20,000 వేలు చొప్పున ఐదేళ్ల గాను లక్ష రూపాయలు వ్యవసాయ పెట్టుబడి సహాయం అందించడానికి చర్యలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టిందని అన్నారు. రైతులు సంక్షేమంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని రైతు పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. పీలేరు నియోజకవర్గ స్థాయిలో భూములు ఉన్న రైతులు అధ్యక్షులుగా ఎన్నికైన వారికి శాలువాతో ఎమ్మెల్యే అభినందించారు. మేము ఎమ్మెల్యేలుగా ఈ స్థానంలో ఉన్నామంటే ప్రజలు రైతులు కార్యకర్తలు అభిమానులు వారి గొప్పతన మేనని పేర్కొన్నారు.

## అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-పీలేరు :-రాజ్యాంగ నిర్మాతని ఎవరైనా అవమానించాలని చూస్తే ప్రత్యామ్నయ శక్తిగా అవతరిస్తాం ప్రజాసంఘాల నాయకులు మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా జడ్పీ కో - ఆప్షన్ సభ్యులు షామియానా షఫీ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం కళ్ళగంతలతో ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేసారు. నిరసనను ఉద్దేశించి మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో - కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేద్కర్ ఎప్పటికీ కూడా ఈ దేశంలో ప్రత్యామయ శక్తిగా నిలుస్తాడని అన్నారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, పీలేరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్,జాన్ స్టేట్ లీగల్ అడ్వైజర్ గుండ్లూరు సదశివా, జిల్లా మహిళా అధ్యక్షులు గుండ్లూరు రాజేశ్వరి, బంజారా సేవా సంఘం పీలేరు నియోజకవర్గ ఇంచార్జి బుక్కే హరి నాయక్ డి.బి.ఎస్. యఫ్. అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్, బాస్ జిల్లా నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య, మాలమహానాడు మండల ప్రధాన కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్, కార్యదర్శి మద్దెల బాల గంగాధర్,సహాయ కార్యదర్శి తుమ్మల రవిచంద్ర, జాస్ జిల్లా వ్యవసాయ అధ్యక్షులు దప్పేపల్లి సురేంద్ర, మచ్చ రెడ్డయ్య,మండల అధ్యక్షులు అవసాని సురేంద్ర, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి గురునాధ, మాణిగుంటి, నాగేశ్వరావు, శ్రీనివాసులు, ద్వారకా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ సేన 13వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-పీలేరు : భారతీయ అంబేద్కర్ సేన 13వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీలేరు పట్టణంలో అంబేద్కర్ కూడలి నందు వార్షికోత్సవ వేడుకలను బాస్ నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం భారతీయ అంబేద్కర్ జెండాను ఆయన ఆవిష్కరించి, బాస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ భారత సమాజాన్ని సశాస్త్రీయమైన సమాజంగా రూపొందించడానికి వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సామాజిక న్యాయ పోరాట ప్రస్థానానికి కొనసాగింపుగా భారతీయ అంబేద్కర్ సేన అనే సంస్థను 2012 వ సంవత్సరం డిసెంబర్ 20వ తేదీన భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ స్థాపించారని, కుల నిర్మూలన రాజ్య సామ్యవాదం సాధించడం ద్వారా అంబేద్కర్ మహనీయుడు కోరుకున్న సర్వజన సమతా సమాజ నిర్మాణం వైపు విశాల ప్రజా సమూహాలను కదిలించడానికి భారతీయ అంబేద్కర్ సేన సైద్ధాంతిక ఉద్యమ బాటలో ప్రయాణిస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్న దళిత,గిరిజన ప్రజలకు ఉచిత విద్యుత్ విద్యుత్ పథకాన్ని అందజేయాలని బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ అమర నిరాహార దీక్ష చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి 50 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీల ఇండ్లకు ఫ్రీగా ఉచిత విద్యుత్ పథకం ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య ఆరుమడకల నాగరాజ, నాయకులు నాగేశ్వరరావు,పల్లె పోగు హరినాథ, ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, రాంబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కును అందించిన ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీ

**విశాలాంధ్ర-మదనపల్లె:** మదనపల్లి పట్టణం ఎగువ కురవంకకు చెందిన ఖాదర భాష, నూర్జహాన్ తనయుడు భావజాన్‌కు కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని బాప్టిస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుని ఆదుకునేందుకు స్పందించిన మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష సీఎంఓ ఆఫీస్ తో మాట్లాడి రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తెప్పించారు. శుక్రవారం బాధి తుని తల్లి నూర్జహాన్‌కు ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు తల్లి మాట్లాడుతూ రూ.10 లక్షలు అవసరమైన సందర్భంలో రూ.5ఐదు లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తెప్పించి మా కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

## ప్రభుత్వానికి ప్రజల ఇబ్బందులు పట్టవా..వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు

**విశాలాంధ్ర -రైల్వేకోడూరు:** కూటమి ప్రభుత్వానికి ప్రజల ఇబ్బందులు పట్టవు అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడూరు నుండి రెడ్డివారిపల్లికి వెళ్లే గుంజన వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో తక్షణం స్పందించి పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి వరద ఉధృతికి కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు వద్దకు వెళ్ళి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోడూరు నుండి రెడ్డివారిపల్లికి వెళ్లే దారిలోని గుంజన వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పలు గ్రామాలకు వెళ్లే ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు మండల పరిషత్ ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచులు బుడిగి శివయ్య,ఆనాల చంగల్ రెడ్డి, ఎంపిటిసిలు తేనీరు ఆంజనేయులు,బండారు మల్లిఖార్జున,మందల శివయ్య,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు,పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్ బాబు, కిషోర్,శివాలయం కమిటీ మాజీ సభ్యులు కొర్లకుంట శంకర,డివి రమణ,దామర్ల శిద్దయ్య,వైఎస్ కరీముల్లా,ప్రతాప్ రెడ్డి, పెనుగొండ సుబ్బరాయుడు,షఫీ తదితరులు అప్రోచ్ రోడ్డు పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జెఎన్‌టియులో ఆశ్రయ్ 2కె 24-25 ప్రారంభం

**విశాలాంధ్ర- పులివెందుల:** స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆశ్రయ్ 2కె 24-25 రెండు రోజులు పాటు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన సదస్సు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు 200 విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏం.సూర్యనారాయణ రెడ్డి, పేపర్ ప్రజెంటేషన్ అతిథిగా ప్రస్ వి వి ప్రసాద్, సదస్సు ఇంచార్జ ఎన్.మురళీమోహన్ సివిల్ విభాగ అధ్యాపక, అధ్యాపకేత్ర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు

### రాజంపేటలో నూతన నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం భవన ప్రారంభోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి

**విశాలాంధ్ర - రాయచోటి :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఉద్యోగులు అందరూ ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చునని ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి తెలిపారు. రాజంపేటలో నూతనంగా నిర్మించిన నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం భవన సముదాయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎన్జీవో సంఘం నాయకులు ఉద్యోగులు ఐక్యంగా ఉండటం వల్లే ఈరోజు ఇంత పెద్ద భవనాన్ని రాజకీయ నాయకులకు సంబంధం లేకుండా ఇక్కడ నిర్మించారని తెలిపారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి నూతన కాంప్లెక్స్‌ను నిర్మించడం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ప్రతి మండలంలో ఇదేవిధంగా ఉద్యోగులందరూ ఐక్యతగా ఉండి ఇలాంటి భవనాలను నిర్మించుకుంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగస్తులకు చాలా అన్యాయం జరిగిందని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగస్తులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తూ ఎదురుచూస్తున్నామని చెప్పారు. నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వి శివారెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ వై ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవి కుమార్, రాజంపేట తాలూకా అధ్యక్షులు ఎస్ వెంకటరమణ, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఓ వి శివారెడ్డి, ట్రెజరర్ ఎం వరదయ్య, రాజంపేట తాలూకా ఎన్జీవో వైస్ ప్రెసిడెంట్ లు ఎస్ రామానుజులు కే కిరణ్ ఎం హరి ప్రసాద్ బాబు బి శ్రీనివాసరాజు లు, జాయింట్ సెక్రటరీలు వై ఎం వి విజయకుమారి, పి సుబ్బరాయుడు, పి వెంకటేష్, మహేష్ మోడీ, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటసుబ్బయ్యలతోపాటు రాజంపేట ప్రాంతంలోని ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ ఎన్జీవో రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం..

రాజంపేటలో నూతనంగా నిర్మించిన ఏపీ ఎన్జీవో భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు రాజంపేట విచ్చేసిన ఏపీ ఎన్జీవో నాన్ గెజిటెడ్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కే వి శివారెడ్డికి కార్యదర్శి పురుషోత్తం నాయుడుకు వైస్ ప్రెసిడెంట్ వై ప్రసాద్ యాదవ్ కు జిల్లా ప్రెసిడెంట్ బి శ్రీనివాసులకు రాజంపేట ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటరమణ, ఓవి శివారెడ్డి, పి. సుబ్బరాయుడు ఇతరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలవాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నూతనంగా నిర్మించిన ఏపీ ఎన్జీవో భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంధనాన్ని పొదుపు చేయండి- ట్రాన్స్కో ఏ ఈ రెహమాన్

**విశాలాంధ్ర- కలికిరి:** ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ట్రాన్స్కో ఏ ఈ రెహమాన్ ప్రజలను కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారాసువాల్లో భాగంగా శుక్రవారం కలికిరి లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కలికిరి క్రాస్ రోడ్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు ఇంధనాన్ని పొదుపు చేసి, వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి సహకరించాలని, తద్వారా భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఈ శివయ్య విద్యుత్ శాఖ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు

**విశాలాంధ్ర-మదనపల్లె :** ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడ్డాయి.మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, వెంకటేశ్వ రపురం ప్రజల అవసరార్థం ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో శుక్రవారం కోళ్లబైలు పంచాయతీ ఇంఛార్జ్ రాటకొండ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో బోరులో మోటార్, పైపులు అమర్చి నీరు విడుదల చేశారు. బోరు నుండి పుష్కలంగా నీరు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని వెంకటేశ్వరపురం వాసులు తనకు తెలియజేయగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే షాజహాన్ బాషా దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి బోరు వేయించడంతో పుష్కలంగా నీరు పడ్డాయ న్నారు.అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ తమ నీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే, కోళ్లబైలు టిడిపి ఇన్చార్జ్ శ్రీనివాసులు నాయుడికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శ్రీనాథ్, మోహన్ రెడ్డి, రెడ్డి రాయల్, చలపతి, శివానంద నాయక్, రంగయ్య, పూర్ణేంద్ర, ఈశ్వరయ్య, శివన్న, ఆర్టీసీ రమణ, అమర, జయరాం, శివ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**విశాలాంధ్ర - బద్వేలు :** గోపవరంమండలంలోని కాలువపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సర్పంచ్ పసుపులేటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య లను పరిష్కరించేందుకు వచ్చిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. బద్వేల్ సమన్వయకర్త రితేష్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలన్నారు. తమ దృష్టికి వచ్చిన కొద్దిపాటి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామన్నారు.మరికొన్ని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా శుక్రవారంరెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులలో అందుబాటులో ఉన్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.భూములకు సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏర్పడిన సమస్యలు అన్నింటిని కూడా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శ్రీనివాసులుఎంపీటీసీ సిబ్బంది టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుల నిర్మూలన, స్టేట్ సోషలిజం బాస్ లక్ష్యం

### 13వ వార్షికోత్సవాల్లో పీటీయం శివప్రసాద్ ఉద్ఘాటన

**విశాలాంధ్ర -మదనపల్లె:** సమసమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశించిన, కుల నిర్మూలన - స్టేట్ సోషలిజం సాధించడమే లక్ష్యంగా భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) విప్లవ విశాల సమూహాల ఐక్యతకు అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తున్నదని, ఆసంస్థ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక కాలనీగేట్ వద్ద ఆయన బాస్ జెండాను ఎగురవేసి 13వ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం బాస్ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆతర్వాత విశ్రాంత మండల విద్యాధికారి ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప బాస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సంఘసంస్కరణ ఉద్యమానికి కొనసాగింపుగా ఆవిర్భవించిన విప్లవ విశాల వేదికగా బాస్ సంస్థను అభివర్ణించారు. బాస్ సంస్థ 19 ఉచిత గుండె వైద్య శిభిరాలు నిర్వహించిందని, ఇందులో 5600 మందికి స్క్రీనింగ్ చేయగా, 526 మందికి గుండె జబ్బులు ఉన్నట్టు నిర్ధారణ కాగా,ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరిగిందన్నారు.. 29న "కుల దహనం" పేరుతో మదనపల్లెల్లో కుల నిర్మూలనా చైతన్య సభ జరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ఎక్సయిజ్ సీఐ జవహర్ బాబు, విశ్రాంత ఏఎస్పీ పెద్దయ్య, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మండెం ప్రభాకర్, ఉద్యోగ నాయకులు మంచూరి మారెప్ప, మలారి గిరిబాబు, నరసింహులు తోపాటు బాస్ నాయకులు నీరుగట్టి రమణ, టి.ఎ. పీర్ బాషా, ముత్యాల మోహన్, రవిశంకర్, చాట్ల బయన్న, గంగులప్ప, రెడ్డెప్ప, దేగాని రమణ, కృష్ణ, జనార్దన్, గంగాధర్, రెడ్డిప్రసాద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నున్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర బాస్ వార్షికోత్సవ కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు.

## వైద్య ఖర్చుల కోసం జిన్నా సేవా సంస్థ అధ్యక్షులు జిన్నా షరీఫ్ ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర- సంబేపల్లి :** సంబేపల్లి మండలం గుట్టపల్లె గ్రామంకు చెందిన నిరుపేద కుటుంబంలో ఇంటి యజమాని అనారోగ్యముతో కూలి పని కూడా చేసుకోలేని పరిస్థితులలో తన కుమారునికి నరాల బలహీనతతో అనారోగ్యానికి గురి కావడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు జిన్నా సేవా సంస్థ అధ్యక్షులు జిన్నా షరీఫ్ ను ఆశ్రయించగా ఆ కుటుంబాన్ని మానవత్వం తో స్పందించి కుటుంబానికి వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకోవడం జరిగింది , గతంలో కూడా మండలంలో మోటకట్ల గ్రామంలో ఒక పెద కూల్ డ్రింక్ షాప్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే పలు గ్రామాలలో నిరుపేద కుటుంబాల పెళ్లి ఖర్చులు కోసం మరియు ఆర్థికస్థోమత లేక చదువుకోలేకపోతున్న నిరుపేద విద్యార్థుల కోసం ఇప్పటికే పలువురికి సహాయం అందించచారు.

# ఆదివాసీల అభ్యున్నతికి సహకరించండి

## స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్ డిమాండ్

**విశాలాంధ్ర-పులివెందుల:** సాంకేతిరంగంలో విప్లవాత్మక మార్పులు చేసుకున్నా.. కంప్యూటర్ యుగం అవతరించినా..నేటి నవీన యుగంలో చాలా మంది ఆదివాసీలు అడవుల్లోనే మగ్గుతున్నారు. వీరి మనుగడ దినదిన గండంగా ఉంది. వీరి జీవనయానం కడుదుర్భరంగా ఉంది. ఇలాంటి ఆదివాసీలకు ప్రభుత్వాలు సహకరించాలని, వారి అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలవాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్ ప్రభుత్వాలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తిత్వ వ్యవస్థల్లో ఆదివాసీలు ఉన్నారని రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ భూభాగం 17.352 చదరపు క.మీ ఉందని, అందులో చెంచు, కోయ, గోండు, కోలాం, పర్దాన్, తోటి, అంద్, నాయక్ పోడు, మున్నే వార్, కొలవార్, లాంటి ఆదిమతెగలు దట్టమైన అడవులలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ప్రకాశం, కర్నూల్, గుంటూరు, మహబూబ్ నగర్, నల్లగొండ, తదితర జిల్లాలలోని దట్టమైన అటవీ ప్రాంతంలో వేల సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. అందులో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐ టి డి ఎ) ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ, ఇవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలయికలో గిరిజన అభివృద్ధి కోసం 1975- 1976 లో దేబార్ కమిషన్ సూచించిన విధంగా ఏర్పడిన సంస్థలని వీటికి స్వయం ప్రతిపత్తి అధికారాలు ప్రత్యేక నిధులు విధి విధానాలతో ఈ భూభాగంలో జీవో నెంబర్ 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలులో ఉంటుందన్నారు. సాధారణ చట్టాలు ఈ ప్రాంతంలో చెల్లవన్నారు. ఈ షెడ్యూల్ ప్రాంత భూభాగము ప్రత్యేకంగా పరిపాలించాల్సినవి కానీ ఆ పరిస్థితులు కనిపించలేదన్నారు. సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం పరిపాలన న్యాయ వ్యవస్థ అంతా కూడా ప్రాజెక్ట్ అధికారి కంట్రోల్ లో పనిచేయాలి కానీ ఆ పరిస్థితి లేదన్నారు. షెడ్యూల్ 5(1) ప్రకారం ఈ ప్రాంత ఉద్యోగాలన్నీ రాజ్యాంగంలోని ప్రకరణ 342ను అనుసరించి 1950 కన్నా ముందు షెడ్యూల్ ప్రాంతంలో స్థిరనివాసం కలిగిన తెగలకు ఇవ్వాలని, దీని ఆధారంగా 29 శాఖలకు 29 రకాల జీవోలను జారీ చేస్తూ 155 రకాల ఉద్యోగాలను ఈ ప్రాంతంలోని షెడ్యూల్ ట్రైబల్ లకు రిజర్వుడు అయ్యాయన్నారు. షెడ్యూల్ ప్రాంతాలలోని ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ విడుదలజేసి ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడినే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందన్నారు. ఉద్యోగస్తుల బదిలీలు మరియు ప్రమోషన్లు ఇక్కడే నిర్వహించాలి ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా విద్యా సంరక్షణ చేయాలి ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నంతవరకు జరిగిందన్నారు. ఆదివాసీలకు రావలసిన ఉద్యోగాలన్నీ మైదాన ప్రాంత వాసులకు వెళ్తున్నాయని, వీరికి విద్య, ఉద్యోగ, ఉపాధి ,రాజకీయ రంగాలలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఎస్సీ ఎస్టీలు రాష్ట్రాలలో వర్గీకరణ చేసుకోవచ్చు అని పిలుపునిచ్చిందని, అయినప్పటికీ ఆదివాసీలు వర్గీకరణకు సుముఖంగా లేరని, ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసి వాస్తవాలు తేల్చి నల్లమల లోని చెంచులకు గ్రామ హోదా పరిస్థితి లేదు వారికి సరైన రోడ్లు, విద్య, వైద్యం కరెంటు వంటి వసతులు కల్పించి చెంచులకు ప్రత్యేక గ్రామ గుర్తింపు నివ్వాలన్నారు.వివిధ నదుల ద్వారా వచ్చు నీటిని వ్యవసాయ పంటలకు ఉపయోగించుకునే విధంగా ఉండాలని తెలిపారు. నేటికీ ఆదివాసీలు వర్షాధార పంటపై ఆధారపడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి బంజరు భూములను ఎంజాయ్ మెంట్ చేసే భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసీలను ఆదుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆదివాసీల పక్షాన నిలవాలని పైడిపల్లి కిషోర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

# రైతుల సంక్షేమమే, కూటమి ప్రభుత్వ లక్ష్యం

**విశాలాంధ్ర- సిద్ధవటం :** రాష్ట్ర ప్రభుత్వం, రైతుల పాడి పరిశ్రమకు అండగా ఉంటుందని రుజువైందని రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. మండలంలోని మాధవరం,-1 గ్రామం, బంగారు పేటలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుండ్ల,పెద్ద సుబ్బరాయుడు,2,లక్షల,30, వేల రూపాయల నిర్మాణంతో గోకుల షెడ్డు నిర్మించారు. శుక్రవారం నియోజకవర్గ ఇన్చార్జ్ బాలసుబ్రమణ్యం ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాడి రైతులకు అండగా, ఉంటుందని, గోవుల సంరక్షణకై నాగేంద్ర,రైతు నిర్దేశించిన కాలంలో నిర్మాణం పూర్తి చేశాడని గ్రామాల్లో ఉన్న పాడి రైతులు ఇటువంటి గోకుల షెడ్డు నిర్మాణానికి అర్హులైన వారికి అందరికీ అందిస్తామని పెన్నా నది నుండి మంచినీరు అందడం లేదని మహిళలు ఫిర్యాదు చేశారని,, చేనేత కార్మికుల సమస్యలపై పరిష్కారం చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా అని అన్నారు కూటమినేతలు ఆయనకు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లి ఎస్ఐ లోకేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

## మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం డిమాండ్

**విశాలాంధ్ర-మదనపల్లె:** తంబళ్లపల్లి ఎస్సై లోకేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత కుటుంబంతో కలిసి మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం మాట్లాడుతూ పసుపులేటి రాజశేఖర్ ఫిర్యాదు చేయడానికి తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్కు వెళ్తే... ఎస్సై లోకేష్ రెడ్డి రాజశేఖర్ ను తీవ్రంగా కొట్టి గాయపర చడం హేయమైన చర్య అని దుయ్యపట్టారు. గతంలో నిమ్మనపల్లి తంబళ్లపల్లిలో టిడిపి కార్యకర్తలు పైన ఉద్దేశపూర్వకంగా పోలీస్ స్టేషన్లో బాధితులను కొట్టడం బెదిరించడం రౌడీషీట్లు తెరుస్తానని బెదిరించడం ఇతనికి మామూలే అన్నారు. ఇలాంటి పోలీస్ అధికారిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో డిఎస్పీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చ రించారు. బాధితులపై నే దొంగతనం మోపి కేసులు నమోదు చేస్తున్నామని బెదిరి స్తున్నారని ఆరోపించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుని వద్దకు ఇద్దరు కానిస్టేబుల్ వచ్చి పై అధికారులకు ఫిర్యాదు చేస్తే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని, లాకప్ డెత్ చేస్తామని బెదిరిస్తున్నాడని బాధితులు వాపోయారు. ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తే ట్రాన్స్ఫర్ చేస్తారని నన్ను ఏమి చేసుకోలేవని హేళనగా మాట్లాడటం, మహిళలను అసభ్యంగా మాట్లాడటం ఎస్సై మానుకోవా లని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే డిఎస్పి స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఏమల చంద్రయ్య గుండాల మనోహర్, మల్లెల మోహన్, లక్ష్మీపతి, అప్పయ్య, రమేష్, రమణ, ఎలక్ట్రిషన్ మోహన్, నారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో చిత్తుగా ఓడినా ఆర్.కె.రోజాకు బుద్ధిరాలేదు

## టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్

**విశాలాంధ్ర-మదనపల్లె :** గత ఎన్నికల్లో చిత్తుగా ఓడినా నగరి మాజీ ఎమ్మెల్యే ఆర్.కె. రోజాకు బుద్ధి రాలేదని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని నిమ్మనపల్లి సర్కిల్‌లోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఆర్నెళ్ల తర్వాత ఆర్.కే.రోజా కూటమి ప్రభుత్వంపై విమర్శలను చేయడం కుంభకర్ణుడు నిద్ర లేచిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పెన్షన్లను పెంచి అరియర్స్ తో పాటు అందజేయడం,దీపం పథకం కింద ఉచిత సిలిండర్లు, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించడం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రిమండలిలో ఆమోదించి ప్రారంభించామన్నారు. టీటీడీ విఐపి దర్శన టికెట్లను దొంగగా అమ్ముకున్న చరిత్ర మీదని, అటువంటి మీకు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు.మాజీ సీఎం జగన్‌వైకాపా పార్టీకి ఇకపై ఏపీలో చోటులేదన్నారు.ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే ఆర్.కె.రోజా వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని హితవు పలికారు.

# రెవిన్యూ సదస్సులో సమస్యలు వెల్లువ

**విశాలాంధ్ర - కలికిరి :** మెడికుర్తి పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. స్థానిక మండలంలోని మెడికుర్తి పంచాయతీ లోని సచివాల యంలో మండల స్పెషల్ ఆఫీసర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన లభిం చింది. మెడికుర్తి పంచాయతీలోని పలు గ్రామాల నుండి రైతులు 51 అర్జీల రూపంలో సమస్యలు తీసుకొచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ భూ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని తమకు సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, సర్పంచ్, సర్వేయర్ రెడ్డప్ప, ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు మలుపులతో అవస్థ పడుతున్న వాహనదారులు

## హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే చిన్న చిన్న ప్రమాదాలు

**విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం :** మిట్టమానపల్లె బ్రహ్మంగారిమఠం వెళ్లే ప్రధాన రహదారి వద్ద రోడ్డు మలుపులతో హెచ్చరిక బోర్డు లేకపోవడంతో రోడ్డు ఇరువైపులా కంపచెట్లతో రోడ్డు సైడ్ కు గుంతలు మెట్ట ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎదురుంగా వస్తున్న వాహనం మలుపులో కానరాకపోవడం చిన్న చిన్న ప్రమాదాలు గురై గాయాల పాలవుతున్నారని సంబంధించిన అధికారులు రోడ్లపై దృష్టి పెట్టాలని టు వీలర్ వాహనాలు కూడా మలుపులో అవస్థలు పడుతూ గాయాలపాలవుతున్నారని వర్షాలకు కంప చెట్లు రోడ్లపైకి రావడం, వర్షాలకు రోడ్డుకు సైడ్ గుంతలమిట్టలో ఉండడం వాహనాలు కిందికి అవకాశం లేకపోవడం ఈ ప్రమాదాలు గురవుతున్నారని ప్రజలు వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధించిన అధికారులు గుంతలు పూడ్చి అక్కడక్కడ మలుపులు వద్దహెచ్చరిక ఏర్పాట్లు చేయాలని వాహనా దారులు కోరుతున్నారు.

# ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆకేపాటి

**విశాలాంధ్ర-నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఆర్ అండ్ బి బంగ్లా వెనకవైపు గల ఇండ్ల చుట్టూ చెయ్యేరు నుండి కన్యకా చెరువుకు కయ్యం కాలువ ద్వారా ఈమధ్య కురిసిన వర్షానికి వరద నీరు వెళ్లడంతో కయ్యం కాలువ గండ్లు పడటంతో వరద నీరు ఇండ్లను చుట్టూ ముట్టి ప్రజలు జలదిగ్బంధంలో ఇరుక్కున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి శుక్రవారం ఉదయం బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి సమస్యకు పరిష్కారం చూపుదామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ చెయ్యేరు నుండి కన్యకా చెరువుకు నీరు అందించే ప్రధాన కాలువ పలుచోట్ల లీకేజీకి గురికావడం వల్ల ఆ నీరు ఇండ్ల చుట్టూ చేరి ప్రజలను భయాందోళనకు గురైన విషయం తన దృష్టికి తేవడం జరిగిందని అన్నారు. వెంటనే తాను సంఘటనా స్థలికి వెళ్లి సమస్యను పరిశీలించి రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నదియాదేవి కి ఫోన్లో సమస్యను వివరించి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు.వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ స్థానిక తహసిల్దార్ అమర్నాథ్ ను బాధిత కుటుంబాల వద్దకు పంపించడం జరిగిందని అన్నారు. దీంతోపాటు కన్యకా చెరువు నీటి సంఘం అధ్యక్షులు బూసెట్టి వెంకటసుబ్బయ్య ను ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని ఆదేశించానని అన్నారు. బాధితులు ఎవరు భయపడవద్దని రెండు రోజుల లోపల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, ఉప సర్పంచ్ ఇబ్బు, వైఎస్ఆర్సిపి నాయకులు గుండు మల్లికార్జున్ రెడ్డి, నడివీధి సుధాకర్, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, అరిగే హరిబాబు, ఆనాల మధు యాదవ్, అజీజ్, సుభాన్, నవాబ్, కరిముల్లా, అన్సర్ భాష, మహబూబ్ బాషా, ముమ్మడిశెట్టి సుధాకర్, పుత్తా శంకర్,బూసి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆకేపాటి రమేష్ రెడ్డి, విజేయుడు, ఏలుమలై, పనతల గంగయ్య, ఎముక దుర్గయ్య, దియ్యాల రాము, తదితరులు పాల్గొన్నారు.